
# గుడ్ బై అమెరికా

--మళయాళ మూలం : పాల్ జకారియా
--అనువాదం : ముళ్లపూడి సుబ్బారావు



అమెరికాలో ఉన్నప్పుడు నాది అద్భుతమైన జీవితం!

హేండిల్స్‌లో ఉన్న సీసాలలో "జానీ వాకర్", జాడీలలో 'రాయల్ సెల్యూట్' ఆహ్వానిస్తూ ఉండేవి. చాలా చవక కూడా! కావాల్సిన పదార్థాలన్నీ ప్యాకెట్లలో దొరుకుతాయి. చాలా మృదువుగా వుంటాయి. ఒక్కసారి కూడా చెడిపోవటం కానీ, 'ఫ్రెషనెస్' పోవటం కాని నేను చూడలేదు. 'కుడుతురుత్తి'లో దొరికే బ్రెడ్ కూడా వాటి ముందు దిగదుడుపే! మాంసం సమృద్ధిగా దొరుకుతుంది. ఏ రకమైనాసరె! మన రొయ్యలు, నత్తలు, కొద్దిగా ధర ఎక్కువ. మిగతా చేపలు అమోఘం!

అప్పుడు.....పొద్దుటే మెలకువ వచ్చాక కొద్దిసేపు బెడ్‌మీదే వుండి "నేనెక్కడ ఉన్నాని అని ఆశ్చర్యపడుతుండేవాడిని. లేవాలనిపించేది కాదు.'మచనట్టు'లో వరిపొలాల్లో, బురదగుంటల్లో ఒకప్పుడు చేపలు పడుతూవుండే 'జోసీ' ని నేనేనా అని ఆశ్చర్యపడుతుండేవాడిని.'కుడుతురత్తి' గ్రామం చేసే శబ్దాలేవి నాకు విన వచ్చేవికావు. ఓసారి బెడ్‌మీద వుండి శ్రద్ధగా వింటున్నాను....ఆశబ్దం .......వరిచేల మధ్య నుండి 'ఫక్కిరి' పక్షి అరుపా? కాదు! ఉదయం ప్రార్థనకోసం పెద్ద చర్చినుండి అలలు అలలుగా వినవచ్చే ఘంటారావమా? కాదు! గిన్నెలుతోమేటప్పుడు 'రోజిలీ' తీసే కూనిరాగమా? కాదు! అమ్మ బావినుండి నీళ్లుతోడేటప్పుడు వినవచ్చే గిలక చప్పుడా? లేదు లేదు! నేనిక్కడ అమెరికాలో ...... న్యూయార్క్‌లో వున్నాను. ఆకాశహర్మ్యం పై భాగాన! మైగాడ్! గదిలో ఫ్రిజ్ చేసే సన్నటిరొద. ఎయిర్ కండీషనర్ గొణుగుడు తప్ప నిశ్శబ్దంగా వున్న ఇక్కడ నేనేం చేస్తున్నాను? నాకేం వినవస్తుంది? అఁ ....అక్కడ.....మాస్టర్‌బెడ్ రూంలో టి. వి. ఎవరు దాన్ని ఆపటం మరిచిపోయింది? ఇంకెవరు? నేనే! రాత్రి బేస్‌బాల్ మ్యాచ్ చూస్తూ నిద్రలోకి జారిపోయాను. రాత్రి ఎప్పుడో లేచి బేబి క్రిబ్ ప్రక్కనున్న బెడ్‌మీదికి వచ్చివుంటాను. బేస్‌బాల్ మ్యాచ్‌చూడాలని పెద్దగా నాకేమీ లేదుగాని, చూడకపోతే రేపుఎవరైనా తప్పక అడుగుతారు. అందువల్లే చూడటం. సరిగా అర్థం కూడా కాదు. 'మమ్ముట్టి'నో 'నెడుముడి'నో 'మోహన్‌లాల్‌నో' టి. వి. తెరమీద చూడాలని ఎంతగా అనిపించిందో!

నేను ఇలాగే వుండిపోతాను.... బద్ధకంగా ...కాఫీ పెట్టుకోవాలని అనిపించేంత వరకు..... కాఫీ పెట్టుకొని తాగి, టాయ్‌లెట్‌కు వెళ్ళాను. బ్రష్ చేసుకుని వెనక్కు వచ్చాను. అప్పటికి గాని బాబులేచాడుకాదు. వాణ్ణి ఎత్తుకుని 'నాపీ' మార్చి శుభ్రం చేసి పాలలో 'సీరిల్స్' కలిపి తినిపించాను. 'ప్లేపెన్'లో వాడిని వదిలి బ్రేక్‌ఫాస్ట్ తయారు చేస్తాను. ఫ్రిజ్‌లోంచి కొబ్బరి, ఉల్లిపాయలు, ఎండుమిర్చి, కరివేపాకు, కొబ్బరి నూనెలతో తయారు చేసిన వంటకం తీసాను. రెండు గ్రుడ్లు ఫ్రై చేసాను. తరువాత మాంసం కూర తీసి దాన్ని వేడి చేసాను. ఫిష్‌ఫ్రై, బ్రెడ్ వగైరాలన్నిటిని టేబిల్ పై చేర్చాను. డబుల్ లార్జ్ జానీవాకర్ గ్లాసులో పోసాను. ఉదయం పూట దాన్లో ఏమీ కలపటం ఇష్టం వుండదు. నోటినిండా అది తీసుకుని పుక్కిలించే సరికి నోరంతా తిమ్మిరిగా వుంటుంది. రెండు గుక్కలు తీసుకునేసరికల్లా లోపల చల్లబడ్డట్టుగా అనిపిస్తుంది. నా ఖాళీ కడుపులోకి, క్రిందిక్రిందికి అది దిగుతుంటె, మెట్లు మీదుగా క్రిందికి దిగుతున్నట్టు అన్పిస్తుంది. చెప్పండి! జానీవాకర్‌తో పోల్చగల విస్కీ ఏదైనావుందా?

తాగడం పూర్తిచేసి స్నానానికి వెళ్లివచ్చేసరికి 'టెస్సి' వచ్చింది. తాళం తీసేశబ్దం. బాబు ఆమె రాక గుర్తుపట్టి చేసే శబ్దం. వాణ్ణి ఆమె ముద్దుపెట్టుకుని బెడ్‌రూంలోకి రావడం అన్నీ నాకు వినవస్తున్నాయి. ఆమె కోసం బాబు ఏడ్వడం చూసి కొద్దిగా అప్సెట్ అయ్యాను. నేను బాత్‌రూంలోంచి బయటకు వచ్చేసరికి టెస్సీ తనదుస్తులు తీసివేసి పాంటీస్‌తో వుంది. మొహానికి క్రీం రాసుకుంటోంది.

ఆమె బాబుని ఎత్తుకునే లోగా నేనామెను చుట్టేసాను. ఆమె ఇంగ్లీషులో అస్పష్టంగా గొణిగింది. తరువాత "యులుకొనైన్" అనో


Jairam..


అలాంటిదేదో అంది. మొహం మీదే ముద్దు పెట్టి దుప్పటిలోకి దూరిపోయింది. కొద్దిసేపట్లోనే నిద్రలోకి మునిగిపోయింది. ఆమె మళయాళ భాష పూర్తిగా మరిచిపోయినట్టే వుంది. హాస్పిటల్లో మళయాళీ నర్సులు చాలా మందే వున్నారట! కాని తెల్లవాళ్ల ముందర మళయాళం మాట్లాడుకోవటం బాగుండదట! ఇంటివద్ద కూడా ఆమె చాలావరకు ఇంగ్లీషులోనే మాట్లాడుతుంది.

బాబు ఏడుపు మానేవరకు వాడిని ఆడించాను. వాళ్ల అమ్మ కావాలని అడిగితె బెడ్‌రూమ్‌లోకి తీసుకుపోయాను. మొద్దులా నిద్రోతున్న వాళ్ళమ్మను స్పృశించాడు.

ప్లేపెన్‌లో బాబును వదిలి లార్జ్‌మెన్ రాయల్ సెల్యూట్‌లో సోడా కలుపుకుని నిశ్శబ్దంగా టెర్రేస్ మీదికి నడిచాను. అమెరికా! దూరంగా........విస్తారంగా.....దిగంతాలకు వ్యాపించివుంది. 'అనుముడి' కొండశిఖరం మీద నిలబడి క్రిందికి చూస్తున్నట్టుగా అన్పిస్తుంది నాకు. న్యూయార్క్ నగరం నాపాదాల క్రింద వుందిపుడు. "జోసీ!" నాకు నేనే చెప్పుకుంటున్నాను. "చూడూ! ఇది న్యూయార్క్. నువ్వు దీనిముందర నించున్నావు. నువ్వు దీన్ని బొమ్మలలోనూ న్యూస్‌పేపర్లలోనూ చూసిన అదే న్యూయార్క్. ఆపాద మస్తకం నాలో థ్రిల్ ప్రవహించింది. మిగిలిన డ్రింక్‌నంతా ఒక్క గుక్కలో తాగేసి రిబ్బన్లలా సాగే రోడ్లను, కార్లను, పిచ్చి పరుగులెత్తే వాహనాలను చూస్తూ వాటి ఘర్జనల్ని వింటున్నాను.

అక్కడ ....ఓపెద్ద ద్వీపం వుంది. ఎలనంకుల్ కుటుంబానికి చెందిన మతాచన్ తన భార్యతో వుంటాడక్కడ. బ్రాంక్స్ ఎక్కడ వుంటుంది? మా కాచప్పన్ వాళ్ల తమ్ముడితో అక్కడే వుంటాడు. బి. ట్రెయిన్ ఎక్కి చాలా కాలం అయింది. బ్రాంక్స్‌లో కార్డ్‌గేమ్‌కి ఆఖరు సారి ఎప్పుడు వెళ్లానో మరిచేపోయాను.

గోపీ, కుట్టప్పన్‌లు ఇంకా మౌంట్ వెర్నాన్‌లో వున్నారో లేదో? గత సంవత్సరం వాళ్ళతో మారీలాండ్‌లో డేర్‌మౌంట్‌కి వెళ్లాను. తప్పతాగి వున్న కుట్టప్పన్ 'లేడీ' అని పొరబడి అక్కడ తిరుగుతున్న ఆవుని కాల్చేసాడు. ఆ కాళరాత్రి అక్కడ్నించి చచ్చీ చెడి బయట పడ్డాము. రెండ్రోజులు ఇంట్లోంచి మొహాలు బయటపెట్టలేదు. తమకు సంబంధించిన వస్తువుల విషయంలో తెల్లవాళ్ళు




మహారాక్షసులు. వాళ్లతో కలిసివుండాలని మనకి రాసిపెట్టి వున్నప్పుడు మనమేం చేయగలం.

బ్రిడ్జిమీదుగా పోయేరోడ్డు. న్యూజెర్సీ. ఫిలడెల్ఫియా వాషింగ్‌టన్‌లకు పోతుంది. ఇలా సాగిపోయే రోడలనుచూస్తే నాకు చాలా బాధనిపిస్తుంది. అయ్యో! ఈ రోడ్లన్నీ రకరకాల ప్రదేశాలకు తీసుకుపోతున్నాయి. కాని నేనిక్కడ, ఈ ఎత్తైన రాతి భవనంలో బేబీ సిట్టింగ్‌లో వుండిపోయాను. నేను 'కెన్నడీ'కి ఎవర్నో కలువటానికి పోయినప్పుడు నన్ను నేను పోగొట్టుకున్నట్టు అన్పించింది. అంతా విమానం ఎక్కుతున్నారు. కొచ్చిన్‌కు ఎగిరిపోతున్నారు. మరి నేను! నేను నా బ్రతుకంతా ఇక్కడే గడుపాలి. చలిలో...... జీవితమంతా.......తెల్లవాడి అర్థంలేని మాటలు వింటూ........లిఫ్ట్‌మీద పైకి క్రిందకు తిరుగుతూ......షాపింగ్ చేస్తూ.... బట్టలు ఉతుకుతూ....అంట్లు తోముతూ ఇట్లా తిప్పలు పడుతూ ఇక్కడ వుండటం అర్థం వున్న పనేనా? డబ్బు అయితేవుందిగాని అదే జీవితమా? చిరునవ్వు నవ్వడానికైనా లేకుండా, జీవితాన్ని అనుభవించడానికి లేకుండా దేనికిదంతా? డబ్బంతా పోయేటప్పుడు పట్టుకుపోతామా?

క్రితం రాత్రి అంట్లన్ని వాషర్లో వేయాలి. శనివారమైతే వాషింగ్ మెషిన్లో వేసి బట్టలన్నీ ఉతకాలి. టెస్సీ బట్టలన్నీ హాస్పిటల్ వాసన వేస్తాయి. ఆమె శరీరం కూడా అదే వాసన! లేకపోతే నాకే అలా అన్పిస్తుందేమో? రెండు కేన్ల బీరు తీసి మగ్గులో పోసుకొని వాషింగ్ దగ్గర కూర్చున్నాను. ఇంతకన్నా మంచి బీరు మరెక్కడ దొరుకుతుంది. ఇంత చవుకగా. బీరు నెమ్మదిగా రాయల్ సెల్యూట్‌ని వెదుక్కుంటూ లోపలికి దిగుతుంటె నేను తేటపడ్డాను. బాబు నిద్రపోతున్నాడు. బియ్యం కడిగి ఉడకేసాను. ఫ్రిజ్ నుండి తీసింది ఏదైనా తినగలను. ఒక్క అన్నం తప్ప! నేను తినే అన్నం కొద్దే అయినా వేడిగానూ, తాజాగానూ ఉండాల్సి వస్తుంది. బియ్యం ఉడికేలోగా కరివేపాకు మజ్జిగలో కలిపాను. సాంబారు తయారుచేసాను. కాకరకాయ డీప్ ఫ్రై చేసాను. అప్పడాలు వేయించి మాంసం కూర, చేపల కూర వేడి చేసాను. ఇదంతా చేసేలోపు మరో రెండు కేన్లు బీరు చల్లగా తాగాను.

అంతా అయ్యాక టెస్సీని నిద్రలేపాను. ఆమె పాంటీస్‌తో బాత్‌రూంలోకి వెళ్లి ముఖం కడుక్కుంటోంది. జుత్తు బ్రష్‌చేసుకుని పాంట్ వేసుకుంటోంది. 'తలయోలప్పరంబు' నుండి వచ్చిన ఓ యువతిని పాంట్‌లో చూడటం!....కానియ్యి. ఒక్కోసారి ఆమె షర్ట్ వేసుకునే లోగానే చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం చేస్తాను. అప్పుడంటుంది ఆమె "జోసీ?" ఏమైనా అయితే నేను మెటర్నిటీ లీవు తీసుకోవాలి. ఓవర్ టైం పేమెంట్‌రాదు. కండోమినియం ఇన్‌స్టాల్‌మెంట్ ఎలా కట్టాలి? అదీకాక నువ్వు తాగివున్నావు" అంటుంది. పిల్స్ తీసుకోవడం లేదా? ఏమీ జరక్కుండా నేను జాగ్రత్త పడతానులే" అని నేనంటాను. ఆమె ఒప్పుకోదు. "సరే! నీకు అవసరం లేకపోతే నాకూ లేదు. దీనికన్నా చేయదగ్గ పనులు బోలెడు వున్నాయి. దీనికోసం మగవాళ్ళ మోకాళ్ళమీద కూర్చుని ప్రాధేయపడ్తారా?'

టెస్సీ లంచ్‌చేసి బాబుకు పాలు పట్టిస్తుంది. తరువాత టి. వి. కి. అతుక్కుపోతుంది. కొంతసేపు నేను అటూ ఇటూ తిరుగుతాను. సోఫామీద కూర్చుని హాస్పిటల్ విషయాలు ఆమెను అడుగుతాను. నెపోలియన్' బ్రాండీ లార్జ్‌పెగ్ పోసుకుంటూ అంటాను. "లంచ్ తరువాత బ్రాందీ మంచిది" అని. "డిన్నర్ తరువాత మరీ మంచిది" అని వ్యంగ్యంగా అంటుందామె.

అవును ఇదంతాపోయేది కడుపులోకే. ఎప్పుడు తాగాం అన్నది పెద్ద విషయం కాదు. నాకు నెపోలియన్ యిష్టం. దీని వాసన ఆయుర్వేద మందులా వుంటుంది. అది మరీ యిష్టం. నోటినిండా పట్టించి పుక్కిలి

స్తాను. దాని సువాసనను అఘ్రాణిస్తాను. టెస్సీ నిద్రలోకి జారుతుంది. బాబుకూడా నిద్రలోకి జారుకుంటాడు. ఇప్పుడు నాకు మంచి అవకాశం. బాబును తీసి క్రచ్‌లో వుంచి, టెస్సీకి దువ్వటి కప్పి "టెస్సీ మైలవ్, కారుతాళాలు ఇవ్వవా" అని నిద్రకళ్లతో టెస్సీ నావంక చూసింది. ఆమెకు నామీద నమ్మకం తక్కువ. కారు విషయంలో మరీ! నేనొక్కొక్కసారి అబ్బుర పడిపోతుంటాను. ఒకవేళ నాకు ఏమైనా అయితే తను ఏమై పోతుందా అని. బాబు విషయంలో ఆమెకు ఎవరు సాయ పడతారు. ఇంటికి మగాడు తప్పనిసరి. అను మానంగా చూస్తూ, హాండ్‌బ్యాగ్ తెరిచి తాళంచెవులు తీసి వెంటనే ఫ్రిజ్ తెరిచి, బీరు తీసి ఒక్కగుక్కలో దాన్ని మింగి బయట పడ్డాను. మూడుగంటలు .... టెస్సీ, బాబు నిద్రలేచేలోగా మూడుగంటల పాటు.

లిఫ్టులో కాకుండా నడుచుకుంటూ క్రిందఫ్లోర్‌లో అపార్టుమెంటుకు వచ్చి తలుపు తట్టాను. 'జోసఫీనా' చెప్పింది. కాదు కాదు సైగలద్వారా తెలియచేసింది. కాలింగ్ బజర్ నొక్కవద్దని. నాలానే ఆమెకు కూడా ఇంగ్లీషు రాదు. ఆమె స్పానిష్‌లో మాత్రమే మాట్లాడుతుంది. మొదటిసారిగా ఆమెను లిఫ్టులో చూసి ప్రశంసాపూర్వకంగా నవ్వాను. ఆమెను చూట్టం నాకు చాలా ఆనందం కలిగించింది.

మంచి 'త్రిస్సుల్' కుటుంబానికి చెందిన 'క్నానయి' 'క్రిస్టియన్' అమ్మాయిలా అనిపించింది. అందంగా ఆరోగ్యంగా వుంది. తెల్లజాతి స్త్రీకి మల్లే అమ్మాయి జుత్తు రకరకాల రంగులు లేకుండా నల్లగా వుంది. నల్లని అందమైన శరీరం. లిఫ్టులో అప్పుడు మేమిద్దరమే! హలో అంటూ విశాలంగా నవ్వాను. తరువాత కొద్దిగా ఆలోచించిఏమైతే అదే అవుతుందని అనేశాను. 'బ్యూటిఫుల్" తన మృదువైన అందమైన చూపుడు వేలుతో నా మీసాలవంక చూపుతూ నవ్విం దామె. మళయాళంలో అన్నాను. "కావాలంటే ముట్టుకో" ఆమెకు అర్థమై వుంటుందా? నా ఎదుర్రొమ్ము పై చేయి వేసుకొని "ఐ మళయాళం" నవ్వుతూ రెప్పలాడిస్తూ అంది. "ఎస్పానా" అని. ఆమె చేతులనిండా ఏవేవో పార్సెల్లు. క్రిందకూడా ఇంకా చాలా వున్నాయి. లిఫ్ట్ 68వ ఫ్లోర్‌లో ఆగగానే ఆమె బయటకు పోవటానికి సిద్ధం అవుతూ నా వంక చూసింది. నేను ఆమెకన్నా ఒకే ఒక ఫ్లోర్‌పైన వుంటున్నాను. "ఐ 69. ఐ హెల్ప్" అన్నాను. తెల్లటి పళ్ళను మెరిపిస్తూ నాకు కన్నుకొడుతూ అంది "సిక్స్టీనైన్, సిక్స్టీనైన్ కమ్" ఆమెకు సహాయపడేందుకు ఆమెతో అప్పుడు వెళ్లాను. నాకు కన్ను ఎందుకు కొట్టిందో, సిక్స్టీనైన్ అని ఎందుకు పిలిచిందో తర్వాత తర్వాత అర్థమైంది.

జోసఫీనా యజమాని ఓ మళయాళ సైకియాట్రిస్ట్. ఆమె టెస్సీ స్నేహితురాలు కూడా. ఆమె భర్త తెల్లజాతీయుడు. యునైటెడ్ నేషన్స్‌లో మంచి పదవిలో వున్నాడు. సైకియాట్రి సహాయం కోసం అతడు ఈ లేడీ సైకియాట్రిస్ట్ దగ్గరకు వచ్చినప్పుడు ట్రాప్ చేసి పెళ్లి చేసుకొందని టెస్సీచెబుతుంది. సైకియాట్రిస్టుల సంపాదన కూడా బాగుంటుంది. వాళ్లు సంపాదించినంతగా నర్సులు ఎంత కష్టపడ్డా సంపాదించలేరు. పైగా ఈ తెల్లవాళ్లకి రకరకాల భయాలు, ఆందోళనలు, భ్రాంతులు. తరచుగా డిప్రెస్ అయిపోతుంటారు. అలాగాక మరేమవుతుంది? దేనికోసం వాళ్ల పరుగు. పిచ్చిగా పైకీ క్రిందికీ లిఫ్టుల మీద ప్రయత్నాలు. ఏదో పూనినట్లు కార్ల డ్రైవింగ్ ఎవరూ ప్రశాంతంగా కూర్చోరు. జోసఫేనా బాస్, ఆ బాస్‌గారి భర్తా ప్రతిరోజు ఉదయం ఇంట్లోంచి బయటపడి సాయంత్రం ఎనిమిది లోగా ఏరోజూ ఇల్లు చేరరు. కాని శని ఆదివారాలు కాస్త జాగ్రత్తపడాలి. అత్యవసర పరిస్థితుల్లో నన్ను దాచివుంచే చోటు గురించి చెప్తే జోసఫేనా ఎలాంటిదో అర్థం అవుతుంది. అప్పుడు మొదటిసారిగా జోసఫీనాతో కలిసి డాక్టరుగారి మాస్టర్ బెడ్‌రూంలో రౌండ్ వాటర్ బెడ్‌మీద పడుకుని పేఅంగ్‌లో అమర్చబడ్డ అద్దంలోకి చూసాను. అప్పుడు అర్థమైంది. సైకియాట్రిస్టులో వున్న శక్తి ఏమిటో. జోసఫీనా నెమ్మదిగా చెయ్యిసాచి ఒక స్విచ్చి నొక్కింది. బెడ్‌మొత్తం నెమ్మదిగా తిరగడం మొదలు పెట్టింది. నా కనిపించింది. మంచంకూడా నా మనసులానే గుండ్రంగా

## "నా కవిత్వం నా జీవితంలోంచే వచ్చింది"

శ్యామ్యూల్ జె. పోలిమెట్ల

కవిత్వం కలంలోంచి కాదు
నా జీవితంలోంచే వచ్చింది
జీవితం నడిచే దారినిండా
మరణం రాకాసిముళ్ళు పరచినపుడు
జీవితం ప్రవేశించే ద్వారాల్ని
మరణం ఒకదాని వెంట ఒకటి మూసేస్తున్నపుడు
మరణం దగ్గరే నా జీవితం కవిత్వం నేర్చుకుంది
మనిషే మనిషిని తినేసే సంస్కృతి
జీవితాన్ని పెడరెక్కలు విరచి కట్టినపుడు
ఎగసిపడే గుండెలోని దీపాన్ని
నిరంకుశ దురాధికారం ఊదేసి ఆర్పేస్తున్నపుడు
జీవితం మరణం దగ్గరే కవిత్వం నేర్చుకుంది
గుండె బావిలోంచి ఊరే నీటి ఊట నా కవిత్వం
హృదయ గగన సీమలోని నీలిమ నా కవిత్వం
కవిత్వం కలంలోంచి కాదు
నా జీవితంలోంచే వచ్చింది
జీవితంలోతులు అరచినపుడు వచ్చింది
మరణాన్ని చంపే
జీవితం వేసే కేకలోంచి వచ్చింది.




* * *

తిరుగుతుందని. జోసఫీనాను మళయాళంలో అడిగాను "నా బంగారమా ఎక్కడినుండి ఎగిరివచ్చావు" అని. ఆమె జవాబుగా స్పానిష్ భాషలో ఏదో అని నెమ్మదిగా నా బుగ్గ కొరికింది. ఆమె యిప్పుడేమి ఆలోచిస్తుంది. అబ్బురపడ్డాను. నాలానే దూర తీరాలనుండి వచ్చి ఇక్కడ పెద్ద బంగళాలో బంధీ అయింది. ఆమె ఎక్కడికి వెళ్ళగలదు?

నాకు కనీసం కారు తాళం చెవులైనా అందుతున్నాయి. నేను రిస్ట్‌వాచ్ వంక చూడటం ఆమెకిష్టం వుండేదికాదు. టైం చూడటాన్కి చెయ్యి పైకెత్తగానే క్రిందకు లాగేసేది. నా గుండెలమీదకు ఎగబాకి నన్ను పోనీకుండా చేసేది. కాని నాకెలాకుదురుతుంది. మళయాళంలో చెప్పే వాణ్ని. 'జోసఫీనా! నాబంగారమా! నేను వెళ్ళాలి! ఇంకారెండుగంటలేవుంది. నన్ను బైటకు పోనీయ్. కొద్దిగా గాలి పీల్చుకోవాలి. మళ్లేరేపు వస్తానుగా 'నాలే' నేను మాట ఎప్పుడైనా తప్పానా?

ఆమెకు ఆ మళయాళ పదం 'నాలే' మాత్రం అర్థం అవుతుంది. నా గుండెమీదకు ఎగబ్రాకి నాకళ్లలోకి చూస్తూ తన వేలితో నానుదుటిమీద రాస్తూ "నాలే నాలే యన్" అని తరువాత నన్ను వెళ్ళనిచ్చేది.

ఆమెను వదిలి వచ్చేటప్పుడు ఒక్కోసారి జానివాకర్‌మీదికి మనసుపోయేది కాదు. ఇప్పుడదేంలేదు. అవన్నీ తిరిగివచ్చాక. కాని పోలీసులు.....ఒకమారు వాళ్ళు నన్ను పట్టుకున్నారు. ఒక మధ్యాహ్నం పెల్హామ్ ఎక్స్‌ప్రెస్‌వేమీద. టెస్సీకి అప్పుడున్న పాత ఫోర్డుకారుమీద దూసుకుపోతున్నాను....... కారు పాతదైతేనేమి? వాడిలో లోపాలు ఎన్ని ఉన్నప్పటికీ తెల్లవాడు బ్రహ్మాండమైన కార్లు తయారుచేస్తాడు. మొజాయిక్ ఫోర్‌లా నున్నగా వున్న రహదార్లను చూస్తుంటే వాటి అంచులను చూడాలనే కోరిక ఉధృతమవుతుంది. కాని ఎంత దూరం పోగలను. నాకున్న సమయం రెండుగంటలే. కారు వేగం పెంచాను. అది నేను అమెరికావచ్చిన తొలిరోజుల్లో. హఠాత్తుగా చెవులు చిల్లులు పడేట్టుగా హారన్‌మోగించుకుంటూ ఓ పోలీస్ వ్యాన్ నన్ను ఓవర్‌టేక్‌చేసి దారికడ్డంగా ఆగింది. దాదాపు దాన్ని తాకుతున్నట్టుగా కొద్ది అంగుళాల తేడాతో నా కారును ఆపగలిగాను. ఒక పోలీస్ వ్యాన్ నుండి దిగాడు. తలకుపొడుగ్గావున్న టోపి. కళ్లకు సన్‌గ్లాసెస్. ఒకగన్. రబ్బర్ బెత్తాం వంగి నమస్కారం చేశాను. వేరే ఏం చేయగలను. నావీపు మీద మెల్లగా బెత్తంతో అంటించాడా తెల్లవాడు. అప్పటివరకూ కడుపులో జానీవాకర్ ఆదెబ్బకు దిగిపోయింది. ఈ లోపుగా మూడునాలుగు పోలీసుకార్లు అక్కడికి వచ్చాయి. నన్ను మధ్యలో నుంచోబెట్టి వచ్చిన పోలీసులంతా చుట్టు నిలుచుండి, నన్నొదయ్యాన్ని చూసినట్టు చూశారు. ఒకపోలీసు ముందుకువచ్చాడు. 'గన్' సిద్ధంచేసుకుంటూ ఇంగ్లీషులో నన్ను ప్రశ్నించసాగాడు. "అయ్యా నాకు ఇంగ్లీషురాదు ఇంట్లోకూర్చుని. విసుగెత్తి విసుగెత్తి కార్లో బయటకువచ్చాను. నేను చేసిన నేరం ఏమిటి? నన్నేం చేయవద్దు. టెస్సీ ఇంటివద్ద నాకోసం ఎదురుచూస్తుంటుంది". అన్నాను. వాళ్లు నాపాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు గురించి అడిగారు. "ఈ విషయాలన్నీ టెస్సీకి మాత్రమే తెలుసు. నాకు ఏమీ తెలియదు" అని చెప్పాను. నన్ను కొట్టడానికి సిద్ధమయిన అమ్మదగ్గర తప్పించుకోవటానికి ప్రయత్నించ విఫలమైన చిట్కానే వీళ్లదగ్గరా అమలు చేశాను. హఠాత్తుగా భోరున విలపించడం మొదలు పెట్టాను. వాళ్లంతా ఆశ్చర్యపోయి నావంకే సన్‌గ్లాసెన్‌లోంచి చూసారు.




నాచిట్కాపని చేసింది. నా ఏడుపుచూసి వాళ్లంతా పగలబడి నవ్వారు. నాకారుని వాళ్ళవాహనాల మధ్య వుంచి ఊరేగింపుగా మా ఇంటికి తీసుకువచ్చారు. వాళ్ళతోపాటు నన్ను చూసిన టెస్సీ ముఖం తాటి చెట్టులేత మొవ్వలా తెల్లబడిపోయింది. రెండురోజుల పాటు పూర్తిగా నాతో మాట్లాడలేదు. నేను నెమ్మదిగా రోడ్ల వెంట వుండే సైన్‌బోర్డులను అర్థం చేసు కోగలిగాను.

ఎప్పుడూ ఎక్కడెక్కడో తిరిగిరావాలని నాలో తహతహ. తెరచుకొని వున్న రోడ్లపై ఎటూపోలేక నిలబడిపోయివున్నాను. బాబు పుట్టాక నాకు కొద్దిగా కుదురువచ్చింది. అంతకుముందు అటూ ఇటూ పరుగులెత్తే వాణ్ని. టెస్సీ పాతఫోర్డు కారు అమ్మేసి టయోటా కారు కొంది. మెరిసిపోయే ఆ కారుని టెస్సీ తీసుకువచ్చి పార్కింగ్‌లాట్‌లో పార్క్ చేసినపుడు నా మనసు ఎగిరి గంతేసింది. ఆ కారు నాకు జోసఫీనాలా అనిపించింది. తన లాగే కారు కూడా నన్ను ఆప్యాయంగా చూసేది. అందులో ఎక్కి సీట్ బెల్ట్ బిగించుకోగానే నా ఊహల్లో లానే అది ముందుకు దూకేది. అయ్యో! అందులో ఎన్నెన్ని దూర ప్రయాణాలు చేసాను. న్యూయార్క్ నుండి బయటకు పోయే ప్రతిరహదారిని నేను చూశాను. ఓ అమెరికా! నేను జోసిని! కుడుతురుత్తి' ఊరివాణ్ణి 'మచనట్టు కుటుంబం నుండి వచ్చిన వాణ్ణి. మైడియర్ వైట్‌మ్యాన్. నేను జోసిని వచ్చాను. మీకు మంచి మంచి రోడ్లున్నాయి. నా భార్యకు మంచి టయోటా కారువుంది. నాకింకేంకావాలి. కారు కిటికిలోంచి వినవచ్చే గాలి హోరును వింటూ కారులో వున్న స్టీరియోలోంచి నాకు ఇష్టమైన 'పెరియార్ పెరియార్' పెట్టుకుని సీటులో స్థిరంగా కూర్చుని, కారు స్టీరింగును కౌగలించుకుని...ఎక్కడకు జోసి? అమెరికా దేశపు అవతలి అంచుకు. ప్రపంచపు మరో చివరకు.'కుడుతురుత్తికి' 'మచనట్టు' లోని వరిపొలాల బురద గట్టకు.....కాని నాకారు బాగా నజ్జు నజ్జు అయిపోయింది. నాముఖానికి ఎనిమిది కుట్లుపడ్డాయి. ఒక కాలు విరిగింది. నేను గుద్దిన కారులోని శ్వేతసుందరి మూతిపళ్లు రాలిపోయాయి. నేను కొద్దిగా పెద్ద మొత్తంలోనే రాయల్ సెల్యూట్ సేవించివున్నాను. నా శ్వాసను పరీక్షించి పోలీసుకేసు బుక్ చేశారు. నా లైసెన్సును రద్దు చేసారు. నాకు ఇంటి దగ్గర ఖాళీగా కూర్చోవడం మినహా వేరే పనేమీలేదు. చాలా కాలందాకా. అలా మా బాబు పుట్టాడు.

మొదట్లో అందుకు టెస్సీ ఒప్పుకోలేదు. అతి కష్టంమీద నా దారికి తెచ్చుకున్నాను. 'అంతమొండిగా ఎలా వుండగలదామె? నేను అమెరికాలో వుండేది వేరే దేనికోసం?

ఆ తరువాత టెస్సీ లింకన్‌ఫామిలీ కారు కొంది. దాని ముఖం కొద్దిగా కూడా నాకు నచ్చేదికాదు. అది నన్ను అర్థం చేసుకోలేదని కాదు కూడా. దానిమీద చాలాచోట్ల గీతలు గీసి సొట్టలు పడేలా చేశాను. ఒకరోజు న్యూజెర్సీ వెళ్లే రహదారిమీద అది ఆగిపోయింది. ఇంచుమించు చచ్చినదానిలా దాన్నితోసే ప్రయత్నం ఏమీచేయలేదు. కసిగా కాలితో రెండు తన్నులు తన్ని రెండు రాళ్లు దానిపై విసిరి 'పోకుక్కా' జోసిని అంటే నీ కసలు లెక్కలేదు. నువ్వులేకుండా నేను అమెరికాలో బ్రతకలేనా? చూస్తాను. అని టాక్సీలో ఇల్లు చేరాను. అప్పటికే టెస్సీ బాబును జోసఫినాకు అప్పగించి కాల్ మీద హాస్పిటల్‌కు వెళ్లిపోయింది. నేనూ జోసఫీనా కొద్దిసేపు బాబుతో ఆడుకున్నాను. ధైర్యం కూడగట్టుకుని టెస్సీకి ఫోన్ చేసాను. ఆమె నోరారా తిట్టింది. "టెస్సీ! ఆకారోక రాక్షసి. దాని మనసులో దయ్యాలున్నాయి. నేనేమైనా కావాలని ఆలస్యం చేసానా? నీ యిష్టం వచ్చినట్టు చేసుకో! కాని ఒక్క విషయం ఆకారు మంచిదికాదు. అని చెప్పి, బాధతోనూ, కోపంతోనూ జోసఫీనాకు బీరూ, నా కోసం జానీవాకర్ తీసుకుని పై అంతస్తుకి వెళ్ళాను. [illegible] సేపటికి బాబు నిద్రపోయాడు. నేనూ జోసఫీనా వాటర్ బెడ్‌మీద చేరి మా పనులు [illegible]లుపెట్టాం. భగవంతునికి కూడా మా పై కోపం వచ్చి వుండాలి. మాకు బాగా నిద్ర పట్టేసింది. మా మనసులు ఏవో సుళ్లు తిరుగుతూ వుండవచ్చు! అంతకు క్రితం అలా ఎప్పుడూ జరుగలేదు. ఏదోశబ్దం వినబడి నాకు మెలకువ వచ్చింది. బాబు ఏడుస్తున్నాడు. డాక్టరూ ఆమె తెల్లభర్తా పక్కన నిలబడి మా వంక చూస్తున్నారు. జోసఫీనా ఇంకా నిద్రపోతూనే వుంది. మార్బుల్‌రాయిలా. బీరులో జానివాకర్ కలిపి తీసుకుంది. మొద్దనిద్ర పోవడంలో ఆశ్చర్యమేముంది? డాక్టరుగారి వంక చూసి నవ్వి, ఆమె భర్త చేయిలాక్కుని నొక్కి బాబుని తీసుకుని అక్కడనుండి గబగబ బయటపడ్డాను. దరిద్రపు లింకన్‌ఫామిలీ' ఒకప్పుడు లింకన్ పేరుతో ఓ లీడరు ఉండేవాడట. అమెరికాలో! ఆయన పేరు కారుకుపెట్టాడం ఎంత అన్యాయం. 'ఫామిలి' అట. ఆ పిచ్చికుక్క కారు నా ఫామిలి లైఫ్‌ని గొయ్యి తీసి కప్పెట్టింది.

టెస్సీ నన్ను 'కెన్నెడీ'లో ఆఖరుసారి చూసినప్పుడు వెయ్యిడాలర్లు నా చేతిలో పెట్టింది. ఇప్పటికీ అప్పుడప్పుడు కొంత పైకం పంపుతూనే వుంది. అమెరికాలో ఆమె చాలా కష్టపడుతూనే వుండివుంటుంది. బాబును తనతోపాటు హాస్పిటల్‌కు తీసుకువెళుతుందో లేదో? లేక క్రిచ్‌లో మంచి చురుకైనవాడు. వాడిపుడు ఆ తెల్ల వాళ్లతోనూ నల్లవాళ్లతోనూ ఇంగ్లీషులో మాట్లాడుకుంటూ లిఫ్టులో పైకి కిందకి దిగటం ఎక్కడం నేర్చుకుంటూ అటూ ఇటూ పరుగులెత్తుతూ బ్రతకబోతున్నాడు. తరువాత వాడు పొందేదేమిటి? సంబంధీకులెవరూ దగ్గర్లో వుండరు. పోటీలేని పరుగులో పాల్గొంటున్నా అనేక మందిలో వాడూకలిసి అనంతమైన వాహన ప్రవాహంలోకి మరో వాహనాన్ని జోడించుతాడు. ఓ తెల్లజాతి యువతి వాడిచేయి అందుకుంటుంది....టెస్సీ ఎప్పటికైనా నన్ను తిరిగి అమెరికా రమ్మంటుందా? నేనలా అనుకోవడం లేదు. ఆమె ఉత్తరాల్లో ఏమీ తెలియడం లేదు కదా! కాని ఈ పాటికి ఆమె వేరే సంబంధాలు ఏర్పర్చుకొని వుండవచ్చు! ఆమె వుండేది అమెరికాలో! అక్కడ ఏదీ జరగడానికైనా వీలుంటుంది. దొరికిపోయిన వాళ్లలోనేను ఒకణ్ణి. ఆమె ఆ విషయాన్ని మరిచిపోగలదా?

కొన్ని సాయంత్రాలు నేను 'మచనట్లు' వరిపొలాల రాతిగట్ల అంచుల మీద నిలబడినపుడు గట్టుమీద అనేక సంవత్సరాలుగా నిలబడివున్న 'ఎలెంజి' చెట్టు నుండి సువాసనలు నన్ను చుట్టుముడుతాయి. అదే సువాసనగల 'ఫెర్‌ఫ్యూమ్' ను జోసఫినా వాడేది. విషాదమేఘాలు నన్ను కమ్ముకుంటాయి. వరిపొలాల మీదుగా దూరతీరాల వైపు చూస్తూ అనుకుంటాను. జోసఫీనా! ప్రియమైన జోసఫీనా! నాలే... నాలే... నో! గుడ్‌బై అమెరికా!

* * *

